
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేల ప్రకారం ధర పలికాయి. మార్కెట్‌కు 15 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.15

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
36.5°/13.4°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'కదిరి పాలిటెక్నిక్'కు జాతీయస్థాయి గుర్తింపు



ఎన్‌బీఏ గుర్తింపు పొందిన కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు దక్కింది. కళాశాలలో డిప్లొమా ఇన్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ మూడు సంవత్సరాల కాలపరిమితితో కోర్సులు ఉన్నాయి. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ కోర్సుకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ తెలిపారు. కళాశాలలో పని చేస్తున్న అందరి సహకారంతో ఎన్‌బీఏ గుర్తింపు లభించిందని వెల్లడించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ వేముల వీరాస్వామి ఎన్‌బీఏ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



లేపాక్షి: 2024–25 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 1 మార్చి, 2024 నుంచి 31 మార్చి, 2024 వరకూ https://mjpapbcwreis.apcfrr.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 27న, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం సమీపంలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

20న రీజినల్ జాబ్ మేళా



పుట్టపర్తి టౌన్: చిత్తూరులోని వెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎస్‌వీసీఈటీ)కళాశాలలో ఈనెల 20 రాయలసీమ స్థాయి రీజినల్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 100కు పైగా కంపెనీలు మేళాలో పాల్గొంటాయన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి, పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పీజీ, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8374421195, 8142509017 నంబర్లలో సంప్రదించాలన్నారు. వాస్తవానికి రీజనల్ జాబ్‌మేళాను ఈనెల 15న చిత్తూరులో విజ్ఞాన్ సుధ కళాశాలలో నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అనివార్య కారణాలతో తేదీ, వేదిక మార్చామన్నారు.

క్వింటా చింతపండు రూ.22 వేలు



హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.22 వేలు ధర పలికింది. మార్కెట్‌కు గురువారం 2,399 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్టంగా రూ.22 వేలు, రూ.కనిష్టంగా 8,100 మేర పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.6 వేలు, కనిష్టంగా రూ.4,400 ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు వెల్లడించారు.

పది పరీక్షలకు సన్నద్ధం

- అనంతపురం జిల్లాలో 31 వేల మంది
- శ్రీసత్యసాయిలో 22 వేల మంది విద్యార్థులు
- మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం.. 30న చివరి పరీక్ష
- పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులపై అధికారుల కసరత్తు



పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కలిపి 53 వేల మందిపై చిలుకు రెగ్యులర్ విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే విద్యార్థుల పరీక్షల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్ ఉండేలా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

ఇంగ్లిష్ మీడియం విద్యార్థులే అధికం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంగ్లిష్ మీడియానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడమే కాకుండా 8వ తరగతి నుంచే ట్యాబ్‌లు ఇచ్చి వారికి సాఫ్ట్ స్కిల్స్ నేర్పిస్తోంది. 2024లో ఎస్‌ఎస్‌సీ పరీక్షలకు హాజరవుతున్న వారిలో ఎక్కువ మంది ఇంగ్లిష్ మీడియం విద్యార్థులే ఉన్నారు. అనంతపురం జిల్లాలో 31,330 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా అందులో 21,545 మంది ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాయనున్నారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో 22,002 మంది ఎస్‌ఎస్‌సీ పరీక్షలు రాస్తుండగా 16,134 మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాయనున్నారు.

బాలురే ఎక్కువ..

పదో తరగతి పరీక్షలు రాస్తున్న వారిలో బాలురే ఎక్కువగా ఉన్నారు. అనంతపురం జిల్లాలో 16,092 మంది బాలురు కాగా 15,238 మంది బాలికలు ఉన్నారు. కేవలం 854 మంది పైచిలుకు మాత్రమే బాలురు ఎక్కువ. అలాగే సత్యసాయి జిల్లాలో 11,484 మంది బాలురు, 10,518 మంది బాలికలు పరీక్షలు రాస్తున్నారు. ఇదిలా ఉంటే ఎస్‌ఎస్‌సీ పరీక్షలు రాస్తున్న బాలకల సంఖ్య ప్రతి ఏడాదీ పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా..	
పరీక్షలు రాస్తున్న విద్యార్థులు	22,002
బాలురు	11,484
బాలికలు	10,518
ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు	16,134
తెలుగు మీడియం విద్యార్థులు	5,674
ఉర్దూ మీడియం విద్యార్థులు	193
మొత్తం పరీక్షా కేంద్రాలు	115

పకడ్బందీగా ఏర్పాట్లు



పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు వసతులు కల్పిస్తున్నాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. భద్రతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకుంటాం.

– యూ.మీనాక్షి, జిల్లా విద్యాధికారి

వీఆర్‌కు హెడ్‌కానిస్టేబుల్



ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ పెద్ద రామాంజనేయులు

సాక్షి ఎఫెక్ట్..

కదిరి: కదిరి నియోజకవర్గంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పెద్ద రామాంజనేయులును వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతని వ్యవహార శైలిపై 'స్పెషల్ బ్రాంచ్‌లో కీచకుడు' అనే శీర్షికతో గురువారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీన్ని జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఓ ఎస్‌ఐ ద్వారా ప్రాథమిక విచారణ జరిపించారు. అలాగే సదరు హెడ్‌కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ కార్యాలయానికి పిలిపించి మందలించినట్లు పోలీసు వర్గాల సమాచారం. ప్రాథమిక విచారణలో అతను అవినీతికి పాల్పడటంతో పాటు పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న కొందరు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తేలింది. దీంతో అతడ్ని వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై లోతుగా దర్యాప్తు జరిపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

18న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

హిందూపురం టౌన్: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 18న ఉమ్మడి అనంతపురం జిల్లా హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళల, పురుషుల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలరామిరెడ్డి, కార్యదర్శి ముస్తఫా కమల్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లేపాక్షిలోని నవోదయ పాఠశాల క్రీడామైదానంలో జట్ల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు. జట్లకు ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

సేవా సారథులు 'వలంటీర్లు'

- 'వలంటీర్లకు వందనం'లో కలెక్టర్ అరుణ్‌బాబు
- పనితీరు ఆధారంగా మూడు కేటగిరీల్లో అవార్డులు
- వరుసగా నాలుగో ఏడాది వలంటీర్లకు సత్కారం



వలంటీర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ

పుట్టపర్తి అర్బన్: ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వలంటీర్లు సేవలతోనే ముందుకు సాగాలని కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, గ్రామ/వార్డు వలంటీర్ల జిల్లా నోడలాఫీసర్ శివారెడ్డి, పెనుకొండ జెడ్పీటీసీ శ్రీరాములు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా లబ్ధిదారులకు అందిస్తూ.. ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటున్న వలంటీర్ల సేవలను కొనియాడారు. కరోనా సమయంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. ఆదివారమైనా, పండుగైనా, సెలవైనా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములను ఆప్యాయంగా పలుకరిస్తూ సంక్షేమ పథకాలతో పాటు పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో నిరంతరం పని చేయాలని సూచించారు. జాతీయ మీడియా సైతం వలంటీర్ల సేవలను ప్రశంసించిందన్నారు. పేదలకు మంచి చేసే మహాయజ్ఞంలో వలంటీర్ల సేవలను ప్రోత్సహిస్తూ నగదు పురస్కారాలను మరింత పెంచి అందజేస్తోందన్నారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి ప్రభుత్వం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలతో సత్కరించడం గొప్ప విషయమన్నారు. అవినీతి, వివక్షకు తావు లేకుండా సేవలందిస్తున్న వలంటీర్లను గుర్తించి ప్రోత్సాహక అవార్డులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ.. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న వలంటీర్లే ప్రభుత్వ సంక్షేమ యజ్ఞానికి సారథులన్నారు. ఉత్తమ సేవలు అందించిన వారికి నాలుగో ఏడాది అవార్డులు అందించడం సంతోషకరమన్నారు. పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. పేదలకు సేవ చేయడం వలంటీర్ల పూర్వజన్మ సుకృతమన్నారు.

ప్రోత్సాహక నగదు పెంపు..

గతంలో సేవావజ్రకు రూ.30 వేలు ఇస్తుండగా ప్రస్తుతం రూ.45 వేలకు, సేవారత్నకు రూ.20 వేలు ఇస్తుండగా రూ.30 వేలకు, సేవామిత్రకు రూ.10 వేలు ఇస్తుండగా రూ.15 వేలకు పెంచారు. నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్ అందజేశారు. 31 మంది సేవావజ్రలకు రూ.13,95,000, 187 సేవారత్నలకు రూ.56,10,000, సేవామిత్రగా ఎంపికైన 9,125 మందికి రూ.13,68,75,000 అందజేయనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో 10 రోజుల్లో వలంటీర్లను సన్మానించే కార్యక్రమం ఉంటుంది.

కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న వలంటీర్లు..

విజయలక్ష్మి (కుమ్మరవాండ్లపల్లి, కదిరి రూరల్), నాసిర్ ఇస్లాం (హిందూపురం అర్బన్), అక్కులప్ప నాయక్ (కేఎస్ పాల్యం, కదిరి రూరల్) అమృత (కొడపగానిపల్లి, కొత్తచెరువు), రూపకళ (గోవిందాపురం, మడకశిర), మనోహర్‌రెడ్డి (చిలమత్తూరు), తిరుమలయ్య (చిగిచెర్ల, ధర్మవరం), టెస్ట్ మోనియల్ అవార్డు అందుకున్న ఎస్ భారతి (మహమ్మదాబాద్, అమడగూరు), విజయ్ (ముదిగుబ్బ).

'పది'లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

- ఆర్జేడీ రాఘవరెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

పుట్టపర్తి: మార్చిలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎంఈఓలు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని కడప ఆర్జేడీ ఎద్దుల రాఘవరెడ్డి సూచించారు. గురువారం బుక్కపట్నం ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లో పదో తరగతి పరీక్షల ఏర్పాట్లు, తదితర అంశాలపై ఎంఈఓలు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రణాళికలను వివరించారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో అర్థవంతమైన బోధనతో పాటు సాంకేతిక పరంగా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. ఆ దిశగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ.. పదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు సత్యసాయి సంకల్పమనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో ఉన్న పరీక్షల భయం కొంత మేరకు తగ్గుతోందన్నారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ఏడీ నాగరాజు, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ప్రకాశ్‌రెడ్డి, జిల్లాలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


కమనీయం.. రథోత్సవం



రత్నగిరిలో భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం, (ఇన్‌సెట్) అలంకరణలో వల్లీప్రభ సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయాన్నే రథాన్ని పూలు, మామిడి తోరణాలు, అరటి పిలకలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వల్లీప్రభ సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడిని మేళతాళాలతో రథంలో కొలువుదీర్చారు. దేవాలయ ప్రాంగణం నుంచి కోట వీధి వరకూ రథాన్ని లాగారు. భక్తులు రథంపైకి అరటి పండ్లు, పూలు, బొరుగులు, తమల పాకులు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

'సిద్ధం' సభకు ముమ్మర ఏర్పాట్లు



అందంగా ముస్తాబైన సిద్ధం సభా ప్రాంగణం



హెలీప్యాడ్‌ను సిద్ధం చేసిన దృశ్యం

రాప్తాడు: ఎన్నికల శంఖారావంలో భాగంగా రాప్తాడులో ఈనెల 18న నిర్వహించనున్న సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ వేదిక నుంచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. గురువారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి సభావేదిక ఏర్పాట్లను పరిశీలించారు.

50 నియోజకవర్గాల నుంచి...

జిల్లా చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. రాయలసీమ జిల్లాలైన అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో పాటు లక్షల సంఖ్యలో పార్టీ శ్రేణులు 'సిద్ధం' సభకు హాజరు కానున్నారు. ఇప్పటి వరకు 25కి పైగా పార్కింగ్ ప్రాంతాలు గుర్తించారు. కార్యకర్తలకు దగ్గరగా వెళ్లి సీఎం జగన్ అభివాదం చేయడానికి వీలుగా సుమారుగా కిలో మీటరు విస్తీర్ణంతో ప్రత్యేక స్టేజీలను ఏర్పాటు చేస్తున్నారు.

ముమ్మరంగా సాగుతున్న పనులు

సభ జరిగే 110 ఎకరాల విస్తీర్ణాన్ని పూర్తిగా చదును చేసి సభా ప్రాంతాన్ని ముస్తాబు చేశారు. సభా ప్రాంగణం వేనుక భాగంలో సీఎం హెలీ ప్యాడ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. హెలీ ప్యాడ్ దగ్గర నుంచి సభ ప్రాంగణం దగ్గరకు తారు రోడ్డు పనులు సాగుతున్నాయి. సభ ప్రాంగణాన్ని మ్యాట్‌తో కప్పి ముస్తాబు చేశారు. అలాగే రైల్వే బ్రిడ్జి దగ్గర బ్రిడ్జి పనులు జరుగుతుండడంతో బ్రిడ్జి కింద తారుతో డబుల్ రోడ్డు వేశారు. అనంతపురం రూరల్, అర్బన్ డీఎస్పీలు వెంకటశివారెడ్డి, ప్రసాద్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

సీఎం పర్యటన ఖరారు

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 18న జిల్లాకు విచ్చేస్తున్నారు. రాప్తాడులో జరగనున్న సిద్ధం సభలో ఆయన పాల్గొననున్నారు. షెడ్యూల్‌ను సీఎం అదనపు పీఎస్ నాగేశ్వరరెడ్డి విడుదల చేశారు.

18న సీఎం షెడ్యూల్ ఇలా..

- 18వ తేదీ మధ్యాహ్నం 2.45 గంటలకు సీఎం జగన్ పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు.
- మధ్యాహ్నం 2.55 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రాప్తాడుకు బయలుదేరుతారు.
- మధ్యాహ్నం 3.15 గంటలకు రాప్తాడు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3.20 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 3.25 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు.
- సాయంత్రం 5.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- సాయంత్రం 5.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.35 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు.
- సాయంత్రం 5.45 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి వెళతారు.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం



ధ్వంసమైన ఇంటిని చూపుతున్న రెడ్డప్ప

నల్లచెరువు: గ్యాస్ సిలిండర్ పేలడంతో నల్లచెరువు మండలం ఊబిచెర్లలోని ఓ ఇల్లు ధ్వంసమైంది. వివరాలు... గ్రామానికి చెందిన దడిగెల రెడ్డప్ప దుస్తులు ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన పెద్ద కుమార్తె పెళ్లి వేడుకకు బంధుమిత్రులతో కలసి బుధవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా గుర్రంకొండకు తరలివెళ్లాడు. గురువారం తెల్లవారుజామున 4 గంటలకు తాళం వేసిన ఇంట్లో పెద్ద శబ్దంతో సిలిండర్ పేలింది. రెడ్డప్ప ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. గ్యాస్ లీక్ కావడంతో పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. రూ. 15లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రెడ్డప్ప తెలిపారు.

'ప్రత్యేక' పిల్లల సేవల్లో అలసత్వం వద్దు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రత్యేక పిల్లలకు అందించే సేవల్లో అలసత్వం వీడాలని సంబంధిత అధికారులకు ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు సూచించారు. 'విజన్ 2025 ఇన్‌క్లూజివ్ ఆంధ్ర'లో భాగంగా సమగ్ర శిక్ష సమ్మిళిత విద్య విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ అంధుల పాఠశాలలో జిల్లాస్థాయి శిక్షణ ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్లు, స్కూల్ అసిస్టెంట్లు (ప్రత్యేక విద్య) హాజరయ్యారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సంబంధించి సాంకేతిక పరమైన పలు అంశాలపై, యాప్స్ వినియోగంపై సమగ్ర శిక్ష ఎస్పీడీ కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ మల్లికార్జున, రీసోర్స్ పర్సన్లు సునీల్, మహాలక్ష్మీ నాయుడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ షమ, సీనియర్ అసిస్టెంట్ పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు 'చేయూత'

ఈమె పేరు మంజులమ్మ. చిలమత్తూరు మండలం కొత్తచామలపల్లి గ్రామం. శ్రీభారతి మహిళాసంఘంలో సభ్యురాలు. ఇద్దరు కుమార్తెలున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాక ముందు కూలి పనులతో జీవనం సాగించేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత అమలు చేసిన వైఎస్సార్ చేయూత పథకం గురించి తెలుసుకున్న చిన్న కుమార్తె ప్రోత్సాహంతో చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుంది. చిన్నగా మొదలైన వ్యాపారం క్రమంగా పుంజుకొంది. ఇప్పటి వరకూ మూడువిడతల్లో చేయూత కింద రూ.56,250 లబ్ధి చేకూరడంతో ఈ మొత్తంతో దశల వారీగా దుకాణాన్ని అభివృద్ధి చేసుకుంది. దీనికి తోడు స్త్రీనిధి నుంచి రూ.50వేలు రుణం తీసుకుని వ్యాపారాన్ని మరింత విస్తరించింది. ప్రస్తుతం రోజూ రూ.1,200 మిగులు చేతికి అందుతుండడంతో బయటి అప్పులు తీరాయి.



జిల్లాలో నియోజకవర్గాల వారీగా 4 విడతల్లో లబ్ధిదారులకు అందిన మొత్తం

నియోజకవర్గం	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)	నాలుగు విడతల్లో (రూ.కోట్లలో)
ధర్మవరం	19,430	రూ.36.43	రూ.145.73
హిందూపురం	18,782	రూ.35.22	రూ.140.87
కదిరి	19,597	రూ.36.74	రూ.146.98
మడకశిర	21,565	రూ.40.43	రూ.161.74
పెనుకొండ	19,815	రూ.37.15	రూ.148.61
పుట్టపర్తి	16,633	రూ.31.19	రూ.52.53
రాప్తాడు మూడు మండలాలు	7,004	రూ.13.13	రూ.52.53.
మొత్తం	1,22,826	రూ.230.30	రూ.921.20 కోట్లు

- వ్యాపార రంగంలో రాణిస్తున్న మహిళలు
- జిల్లాలో నాలుగు విడతల్లో 1,22,826 మందికి రూ.921.20 కోట్ల లబ్ధి
- నేడు నాల్గో విడత నిధులు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్

హిందూపురం అర్బన్: మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా పలు పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో ప్రధానమైన వైఎస్సార్ చేయూత. పథకం కింద అర్హులైన లబ్ధిదారుకు ఏడాదికి 18,750 అందజేస్తూ స్వశక్తిపై ఎదిగేలా బాటలు వేశారు. నాలుగు విడతల్లో రూ.75,000 చేతికందనుంది. ఇప్పటి వరకూ మూడు విడతల్లో రూ. 56,250 అందగా.. నాల్గో విడత సొమ్ము ఈ నెల 16న ఖాతాల్లో జమకానుంది.

చిరు వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లోని 45 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళల ఆర్థికాభివృద్ధికి నాలుగు విడతల్లో రూ.75 వేలు ఆర్థిక సాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద లబ్ధి పొందిన మహిళలు మెరుగైన జీవనోపాధి అందిపుచ్చుకున్నారు. గతంలో కూలి పనులతో జీవనం సాగించిన వారు సంపద సృష్టి, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సుస్థిరమైన జీవనోపాదులు మెరుగు పరుచుకున్నారు. ప్రభుత్వం అందించిన డబ్బుతో పాడి పశువుల పెంపకం, పాల సేకరణ, కిరాణా దుకాణాలు, దుస్తుల షాపులు, పండ్ల వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి దాంతో వచ్చే ఆదాయంతో ఆర్థికంగా నిలదొక్కుకొంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ మూడు విడతల్లో ఈ పథకం ద్వారా 1,22,826 మందికి లబ్ధి చేకూరింది. నాల్గో విడతలో భాగంగా ఈ నెల 16న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి రూ.230.30 కోట్లు విడుదల చేయనున్నారు.

మేకల పెంపకం చేపట్టా



గతంలో కూలి పనులకు వెళితేనే పూట గడిచేది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ఏటా చేయూత పథకం కింద రూ.18,750 చొప్పున ఇప్పటికి మూడు సార్లు రూ.56,250 నా ఖాతాలో వేశారు. తొలి దశలో వేసిన డబ్బుతో మేకల పెంపకం చేపట్టాను. మేకల విక్రయంతో చేతికి అందిన లాభానికి తోడు రెండు, మూడో విడత కింద అందిన సొమ్ముతో మరిన్ని జీవాలు తెచ్చుకుని పోషణ చేపట్టాను. ఇప్పుడు కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగుంది.

– రాజేశ్వరమ్మ, కల్లూరు, లేపాక్షి మండలం

పేద మహిళలకు వరం



వైఎస్సార్ చేయూత పథకం నిరుపేద మహిళలకు వరంగా మారింది. ఎంతో మంది పాడి, చిల్లర దుకాణాలు, ఇతర వ్యాపారాలు చేసుకొంటూ తమ ఆర్థికాభివృద్ధిని మెరుగుపరచుకున్నారు. ప్రధానంగా పాడిపరిశ్రమ ద్వారా రోజువారీ అదనపు ఆదాయం పొందుతున్నారు.

– కేఎస్ నరసయ్య, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్

సంక్షేమ పాలన వైఎస్ జగన్‌తోనే సాధ్యం

- అంతర్జాతీయ సువార్త ప్రసంగీకురాలు వైఎస్ విమలారెడ్డి



సదస్సుకు హాజరైన పాస్టర్లు



ప్రసంగిస్తున్న వైఎస్ విమలారెడ్డి

అనంతపురం కల్చరల్: దేశంలో మరెక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు కేవలం ఏపీలోనే అమలవుతున్నాయని, ఆ సంక్షేమ ఫలాలు మరోసారి పేదలకు దక్కాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంతర్జాతీయ సువార్త ప్రసంగీకురాలు, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి వైఎస్ విమలారెడ్డి అన్నారు. జిల్లా పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్ వేదికగా గురువారం పాస్టర్ల సదస్సు నిర్వహించారు. పాస్టర్ల సంఘం అధ్యక్షుడు నెహమ్యానాగరాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్ విమలారెడ్డితో పాటు ప్రభుత్వ సలహాదారుడు (క్రిస్టియన్ అడ్వైజర్) బాలాస్వామి, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ బెన్‌హర్‌బాబు, తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. క్రైస్తవులందరూ మళ్లీ ఐక్యమత్యంతో సుభిక్షమైన పాలనను తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాల కుట్రలను, కుతంత్రాలను తరిమికొట్టేలా సామాన్యులను చైతన్యవంతం చేసే శక్తి పాస్టర్లకే ఉందన్నారు. సంక్షేమం అంది ఉంటేనే ఓటు వేయండి, ప్రతి ఇంటికీ మంచి జరిగితేనే ఆశీర్వదించండని ఇంత ధైర్యంగా చెప్పే ముఖ్యమంత్రి దేశంలోనే లేరన్నారు. గత టీడీపీ పాలనలో క్రైస్తవులు పడిన పాట్లను గుర్తు చేశారు. కేవలం జగన్ పాలనలో మాత్రమే పాస్టర్లకు గౌరవవేతనం అందుతోందన్నారు. క్రైస్తవులకు సమస్యలేమున్నా చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకొస్తుందన్నారు. దివంగత వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆయన తర్వాత నిస్సారంగా మారిందని మళ్లీ జగన్ మాత్రమే క్రైస్తవులను గుర్తిస్తున్నారన్నారు. పాస్టర్లు సుధాకర్‌బాబు, మనుష్యే, ఏషయ, విజయ్, జాన్, ఆనంద్, ప్రభాకరరెడ్డి, ఫిలఫ్, కన్వీనర్ ఎస్ఆర్ బాబు, మోజెస్, సునీల్, సిస్టర్ విజయకుమారి తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సామూహిక ప్రార్థనలు జరిగాయి.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి టౌన్: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–సీడాప్ అనంతపురం వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏఆర్‌టీపీ సిల్క్ కళాశాలలో రీటైల్ సేల్స్ సూపర్‌వైజర్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ–సీడాప్ సంచాలకులు నరసింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారై ఉండి 18 నుంచి 26 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్నవారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. తప్పనిసరిగా ఇంటర్ ఉత్తీర్ణులై.. చదువు కొనసాగిస్తూ ఉండకూడదని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డ్, ఉపాధిహామీ కార్డుతో అనంతపురములోని పంగల్ రోడ్డు వద్ద ఉన్న టీటీడీసీ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈనెల 15 నుంచి 18 వరకూ ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 4 నెలల పాటు భోజన సదుపాయంతో కూడిన ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 86394 39804, 96408 99337, 80744 52233 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ మధుబాబు



ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ మధుబాబు

పుట్టపర్తి టౌన్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన తిరుపతి సీసీఎస్ సీఐ మధుబాబు, అనంతపురంలో ఎస్ఐలుగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్, ధరణికుమార్ గురువారం ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు. తలుపుల, తనకల్లు ఎస్ఐలుగా దిలీప్‌కుమార్, ధరణీకుమార్ బాధ్యతలు స్వీకరించారు.

భార్యే హంతకురాలు



ఖాదర్‌బాషా (ఫైల్)

కదిరి అర్బన్: గత నెల 31న హత్య చేసుకున్న వ్యక్తి హత్యకేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భావించిన భార్యే, తన ప్రియుడితో కలసి హతమార్చినట్లు నిర్ధారించారు. ఈ కేసులో నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. వివరాలను కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ వెల్లడించారు. కదిరి మండలం నున్నపుగుట్ట తండాకు చెందిన గులాబ్‌జాన్, ఖాదర్‌బాషా దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తన భర్త కనిపించడం లేదంటూ ఈ నెల 5న ఆమె చేసిన ఫిర్యాదు మేరకు కదిరి రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గులాబ్‌జాన్ ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమెను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో పోలీసులు విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. కొన్నేళ్లుగా కదిరిలోని నిజాంవలి కాలనీకి చెందిన బాబ్జాన్‌తో గులాబ్‌జాన్ వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఖాదర్‌బాషా ఆమెను పలుమార్లు మందలించాడు. దీంతో ఎలాగైనా తన భర్తను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న ఆమె గత నెల 31న రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న ఖాదర్‌బాషాపై కట్టెతో దాడి చేసింది. ఆయన కిందపడిపోగానే అప్పటికే రోడ్డుపై సిద్ధంగా ఉన్న ప్రియుడు బాబ్జాన్‌ను ఇంట్లోకి పిలుచుకుంది. అనంతరం ఇద్దరూ కలసి ఖాదర్‌బాషా గొంతు నులిమి హతమార్చి మృతదేహాన్ని స్కూటర్‌పై తీసుకెళ్లి కారెడ్డిపల్లి సమీపంలోని గుట్టలో పడేశారు. మృతదేహంపై పాత దుస్తులు పడేసి, పెట్రోల్‌పోసి నిప్పంటించారు. మృతదేహం పూర్తిగా దహనం కాకపోవడంతో దానిని ఓ గోనెసంచిలో వేసి రాళ్లు నింపి పక్కనే చెరువులో పడేశారు. ఈ కేసులో నిందితులిద్దరినీ గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు.

ఐఓటీతో విప్లవాత్మక మార్పులు

- ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి
- జేఎన్‌టీయూ (ఏ) వీసీ డాక్టర్ జీవీఎస్ శ్రీనివాసరావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ శ్రీనివాసరావు

అనంతపురం: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)తో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయని జేఎన్‌టీయూ (ఏ) వీసీ డాక్టర్ జీవీఎస్ శ్రీనివాసరావు అన్నారు. జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలోని ఈసీఈ విభాగం, ఐఓటీ హ్యాక్‌థాన్ మేక్ స్కిల్డ్ ఇన్నోవేషన్ – హైదరాబాద్ సంయుక్తంగా మూడు రోజుల పాటు జరిగే సదస్సు గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లుగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.మమత, డాక్టర్ డి.విష్ణువర్ధన్ వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. నిత్య జీవితంలో ఎక్కడో చోట ఐఓటీ అప్లికేషన్స్ వినియోగిస్తున్నట్లు గుర్తు చేశారు. అగ్రికల్చర్, మెడికల్ రంగాల్లో మొదలైన ఐఓటీ నేడు అన్ని రంగాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. ఈ తరహా కార్యక్రమాలు ఇంజినీరింగ్ విద్యార్థుల అభ్యున్నతికి దోహదపడతాయన్నారు. ఉద్యోగం చేయడం కంటే పదిమందికి ఉపాధి కల్పించే ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఐఓటీ, సెన్సార్, డెవపల్‌మెంట్ బోర్డు, ప్రోగ్రామింగ్‌పై మేక్‌స్కిల్డ్ ఇన్నోవేషన్ నిపుణులు అవగాహన కల్పించి మూడో రోజు విద్యార్థులతో ప్రాజెక్టులు రూపొందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యతనివ్వాలని విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమణారెడ్డి, డాక్టర్ లలితాకుమారి, డాక్టర్ అరుణామస్తానీ, విశ్రాంత ప్రొఫెసర్ ఎం.ఎస్. గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో చోరీ

బత్తలపల్లి: స్థానిక తాడిపత్రి రహదారిలోని వెంకటగారిపల్లి సత్రం సమీపంలో ఉన్న దర్గాలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ముజావర్ వలీసాహెబ్ నుంచి సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. దర్గాలోని మజార్ (సమాధి)పై ఉంచిన 30 తులాల వెండి ఆభరణాలతో పాటు రెండు హుండీల్లోని భక్తుల కానుకలను అపహరించుకెళ్లినట్లుగా గుర్తించారు. దాదాపు రూ.18వేలకు పైగా చోరీ జరిగినట్లు ముజావర్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లీగల్ సెల్ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు

పుట్టపర్తి/ముదిగుబ్బ(తాడిమర్రి): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ, ఎస్టీ విభాగ కమిటీల్లో జిల్లా నుంచి పలువురికి చోటు దక్కింది. ఈ మేరకు గురువారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ జనరల్ సెక్రటరీగా రామచంద్రారెడ్డి, సెక్రటరీగా రామచంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీగా జ్ఞాన భాస్కర్ గౌడ్ అలాగే ఎస్టీ విభాగ కమిటీ జోనల్ ఇన్‌చార్జ్‌గా డుంగావత్ రమేష్ నాయక్, అధికార ప్రతినిధిగా కేపీ కుళ్లాయప్ప నాయక్, జాయింట్ సెక్రటరీగా గిరిధర్‌ను నియమించారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రతినిధిగా ముదిగుబ్బ మండలానికి చెందిన కునావత్ పెద్ద కుళ్లాయప్పను నియమించారు.

అదనపు కట్నం కోసం బాలింత హత్య

పావగడ: అదనపు కట్నం కోసం భార్యను దారుణంగా హతమార్చిన ఘటన పావగడ తాలూకా కె.సేవాలాల్‌పురంలో చోటు చేసుకుంది. వివరాలను తిరుమణి సీఐ గిరీష్ వెల్లడించారు. కె.సేవాలాల్‌పురం గ్రామానికి చెందిన శిల్ప(21), నరేష్ దంపతులు. రెండేళ్ల క్రితం వివాహమైన వీరికి ఆరు నెలల క్రితం ఓ కుమారుడు జన్మించాడు. ఈ క్రమంలో అదనపు కట్నం కావాలని తరచూ శిల్పను నరేష్, ఆయన కుటుంబసభ్యులు వేధిస్తూ వచ్చారు. ఇదే అంశంపై బుధవారం రాత్రి దంపతులు తీవ్ర స్థాయిలో గొడవపడ్డారు. ఆ సమయంలో శిల్ప గొంతును నరేష్ నులిమి హతమార్చాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రామచంద్రప్ప, సీఐ గిరీష్ గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై నరేష్, ఆయన తండ్రి, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కాగా, నిందితుడు నరేష్ తిరుమని పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

సేవాగఢ్‌లో ఘనంగా ప్రాకారోత్సవం



ఇరుముడులు సమర్పించేందుకు వస్తున్న సేవాలాల్ మాలధారులు



మహా భోగ్ నిర్వహిస్తున్న దృశ్యం

- ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లోని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంత్యుత్సవాలు గురువారం ప్రాకారోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్‌కు కుంభాభిషేకం జరిపించారు. సేవాలాల్ ఉత్సవ విగ్రహాన్ని తోలారం గుర్రంపై ఊరేగించారు. సేవాలాల్ మాలధారులు భక్తిశ్రద్ధలతో ఇరుముడులు సమర్పించారు. ఆలయం ఎదుట ఉన్న హోమం కట్టపై మహాభోగ్ (హోమం) నిర్వహించారు. 108 మంది కన్యలచే పూర్ణ గంగ కలశోత్సవం నిర్వహించారు. 108 మంది కన్యలు మావలి జగదాంబ ఆలయం వరకూ కలశాలతో ఊరేగింపుగా వచ్చి కుంభాభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సేవాలాల్ మహారాజ్‌కు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాలు విజయవంతం కావడంతో ట్రస్టు సభ్యులు నృత్యాలు చేసి తల్వార్‌తో విన్యాసాలు చేశారు. జయంతి ఉత్సవాల సందర్భంగా బంజారాలతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సంప్రదాయ దుస్తులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, కార్యదర్శి అశ్వత్థనాయక్, సభ్యులు బాలనాయక్, సుబ్రమణ్యం నాయక్, రామచంద్ర నాయక్, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏర్పాట్లు

ఉత్సవాలకు వచ్చిన బంజారాలకు ప్రభుత్వ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజ్‌కుమార్, ఏఈ మంజునాథ్ ఆధ్వర్యంలో తాగునీటి సదుపాయం, బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం, విద్యుత్ శాఖ ఏఈ కుమార్ సిబ్బందితో విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో గిరిజన ఆచారాలు, సంస్కృతిపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాలకు గుత్తి, గుంతకల్లు డిపోల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబిరసూల్ సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

చిలమత్తూరు కేజీబీవీలో హైడ్రామా

- అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఎస్ఓపై బదిలీ వేటు
- ఆపేందుకు విద్యార్థినులను ఆందోళనకు పురిగొల్పిన వైనం
- కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టిన డీఈఓ



ఎస్ఓ రెహనాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈఓ మీనాక్షి

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట వద్ద ఉన్న కేజీబీవీలో గురువారం హైడ్రామా చోటు చేసుకుంది. అనేక వివాదాలు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో పలు ఫిర్యాదులు అందుకున్న ఉన్నతాధికారులు ఎస్ఓ రెహనాను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో బదిలీని ఆపేందుకు హైడ్రామాకు ఆమె తెరలేపింది. గురువారం ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలలోకి ప్రవేశించకుండా విద్యార్థినులతో అడ్డుకునేలా చేశారు. గేట్‌కు తాళం వేయించి ఆందోళనకు దిగేలా విద్యార్థినులను పురిగొల్పడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడాన్ని కలెక్టర్ అరుణ్‌కుమార్ తీవ్రంగా పరిగణించారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్ఐ గంగాధర్‌తో కలసి డీఈఓ మీనాక్షి ఆగమేఘాలపై కేజీబీవీ వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతోనే బదిలీ చేశారని, అయితే ఇక్కడే ఉండేందుకు దుశ్చర్యలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. అనంతరం విలేకరులతో డీఈఓ మాట్లాడుతూ.. ఎస్ఓ రెహనా పనితీరుపై పలు వివాదాలు ఉన్నాయన్నారు. రేషన్ అమ్ముకోవడం, విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, భోజనం సరిగా పెట్టకపోవడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణం కావడం వంటివి చాలా ఫిర్యాదులున్నాయని వివరించారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ అనంతరం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అయితే ఆమె రిలీవ్ కాకుండా విద్యార్థినులను ఆందోళనలకు ఉసిగొల్పి మరో తప్పిదానికి పాల్పడ్డారన్నారు. ఈ అంశంపై కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు వివరించారు.